క్లుప్తంగా...

నాంపల్లిలో 45.56 శాతం పోలింగ్


లావణ్య, రిటర్నింగ్ అధికారి

నాంపల్లి: నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుతంగా జరిగాయని 63-నాంపల్లి నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి లావణ్య పేర్కొన్నారు. ఆమె శుక్రవారం ఆర్‌ఓ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో 45.56 శాతం ఎన్నికల పోలింగ్ జరిగిందని అన్నారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగిందని, అప్పటికే ఓటు వేసేందుకు క్యూలో నిల్చొని ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. సరైన సమయానికి ఈవీఎం మిషన్లన్నీ స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయని వివరించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులందరికీ మంచి భోజన వసతి సౌకర్యాన్ని మూడు పూటల కల్పించామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరపడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

చాంద్రాయణగుట్టలో 45.26 శాతం..

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో మొత్తం 3,37,815 మంది ఓటర్లలో 1,68,945 మంది పురుషులు, 1,68,838 స్త్రీలు, ఇతరులు 32 మంది ఉన్నారు. ఇందులో గురువారం జరిగిన పోలింగ్‌లో 45.26 శాతం నమోదై 1,52,898 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 78,523 మంది పురుషులు, 74,371 మంది స్త్రీలు, నలుగురు ఇతరులు ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి సూర్యప్రకాష్ తెలిపారు.

నాంపల్లిలో ఎన్నికల పోలింగ్ సరళి ఇలా..

నాంపల్లి: నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ శాతం 45.56గా నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 3,32,764 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు-1,71,262, మహిళలు-1,61,492, థర్డ్‌జెండర్-10 ఓట్లు ఉన్నాయి. కాగా 1,51,597 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. వీరిలో పురుషులు-79,741, మహిళలు- 71,856, థర్డ్‌జెండర్-0 పోలయ్యాయి. ఈ పోలింగ్ శాతం 2018 కంటే తగ్గింది. ఈ పోలింగ్ శాతం కూడా గురువారం సాయంత్రం 5 గంటల తర్వాతే అధికంగా నమోదైనట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈనెల 3న ఉదయం 8.30 గంటలకు మాసబ్ ట్యాంకులోని జేఎన్టీయూలో ఎన్నికల లెక్కింపు జరుగుతుంది. ఈ లెక్కింపుకు ఇప్పటికే అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు.

'అవగాహన సదస్సులు సత్ఫలితాలను ఇచ్చాయి'


మహ్మద్ అబ్దుల్ అజీజ్

చార్మినార్: ఈసారి జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఎన్నికలను పురస్కరించుకొని గత కొన్ని నెలల నుంచి ఓటు ప్రాధాన్యంపై మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) ఓటర్లకు చేపట్టిన అవగాహన సదస్సులు సత్ఫలితాలను ఇచ్చిందని ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. శుక్రవారం పాతబస్తీలో తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాగో తెలంగాణ అన్న అంశం తమ కార్యక్రమంలో ప్రధానాంశం అన్నారు. ఈ ఎన్నికలతో పాటు రాబోయే 2024 పార్లమెంటు ఎన్నికల్లో కూడా ఫాసిస్ట్, మతతత్వ శక్తులను అడ్డుకోవడానికి తాము ఇప్పటి నుంచే శాయ శక్తులా సిద్ధమై ఉంటామన్నారు. ముస్లిం మైనార్టీ వర్గాలతో పాటు బడు గు బలహీన వర్గాల ప్రజలను నియంతృత్వ మతోన్మాద శక్తుల బారి నుంచి కాపాడి సెక్యులర్ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. సెక్యులర్ ప్రజాస్వామ్యం ఏర్పాటులో నీతిమంతులైన ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే విధంగా ఓటర్లను జాగృతం చేయడమే ఎంపీజే లక్ష్యమన్నారు.

'అందరి ఆశీస్సులతో బీఆర్‌ఎస్‌దే విజయం'


నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: గోషామహల్‌లో అందరి ఆశీస్సులతో భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు సీఎం కేసీఆర్ ప్రభుత్వ అభివృద్ధి, ప్రగతిని చూసి తనకే ఓటు వేశారన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఓటింగ్‌పై ఆసక్తి చూపలేదన్నారు. రాజాసింగ్ ప్రవర్తనతోనే ఓటింగ్ శాతం తగ్గిందన్నారు. ఓటింగ్ శాతం ఎంత తగ్గినప్పటికీ దాదాపు 20 వేల మెజార్టీతో తానే విజయం సాధిస్తానన్నారు. ఉత్తర భారతీయులు, బస్తీల ప్రజలు, మురికివాడలు, మైనార్టీల వారంతా బీఆర్‌ఎస్‌వైపే మొగ్గు చూపారని నందకిశోర్ వ్యాస్ బిలాల్ అన్నారు.

పాతబస్తీలో పతంగ్ జోరేనా...!

- యాకుత్‌పురాలో మజ్లిస్ పార్టీకి గట్టి పోటీనిచ్చిన ఎంబీటీ
- యాకుత్‌పురాలో కనిపించని కాంగ్రెస్, ఉనికిని కాపాడుకోలేని బీఆర్‌ఎస్, బీజేపీ
- చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురాలో మజ్లిస్ పార్టీకే అవకాశం

చార్మినార్: పాతబస్తీలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, యాకుత్‌పురా నియోజకవర్గాలు మజ్లిస్ పార్టీకి కంచుకోటగా ఉన్నాయి. ఈసారి జరిగిన ఎన్నికల్లో గతంలో లాగే మజ్లిస్ పార్టీ అభ్యర్థుల విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పాతబస్తీ నియోజకవర్గాల్లో మజ్లిస్ పార్టీ బలం-అత్యధిక సంఖ్యలో ముస్లిం ఓటర్లు ఉండటమే. చార్మినార్ నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థికి గట్టి పోటీ ఎదురైనప్పటికీ.. మధ్యాహ్నం తర్వాత పోలింగ్ సరళి మారి మజ్లిస్ పార్టీకి అనుకూలంగా ఏర్పడింది. యథేచ్ఛగా బోగస్ ఓట్లు పోలయ్యాయి. ఎక్కడా గుర్తింపు కార్డుల కోసం సంబంధిత అధికారులు విచారణ (అడగకపోవడం) చేయకపోవడంతో ఎవరు పడితే వారు స్లిప్‌లతో బోగస్ ఓట్లు వేశారు. యాకుత్‌పురాలో మజ్లిస్ పార్టీకి ఎంబీటీ గట్టి పోటీనిచ్చింది.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థుల పోటీ నామమాత్రమే..

- యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి ఎంబీటీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన మాజీ కార్పొరేటర్ అంజదుల్లాఖాన్, మజ్లిస్ పార్టీ అభ్యర్థి మాజీద్ హుస్సేన్ మేరాజ్‌కి గట్టి పోటీ నిచ్చారు. నిజానికి ఈ నియోజకవర్గం మజ్లిస్ పార్టీకి కంచుకోట. అయితే ఈసారి జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గం ఓటర్లు మార్పును కోరుతుండటంతో మజ్లిస్ పార్టీకి కాకుండా ఎంబీటీకి అధిక సంఖ్యలో ఓట్లు పోలైనట్లు సమాచారం. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీకి ఈసారి యాకుత్‌పురా నుంచి టికెట్ దక్కలేదు. ఆయన స్థానంలో నాంపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మేరాజ్‌కు టికెట్ లభించడం.. ఆయన స్థానికేతరుడు కావడంతో ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లాఖాన్ కు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి.
- అయితే ఇక్కడి నుంచి ఎన్నికల బరిలోకి దిగిన మజ్లిసేతర పార్టీలైన బీఆర్‌ఎస్ అభ్యర్థి సామా సుందర్‌రెడ్డి కేవలం ఐఎస్ సదన్ డివిజన్, గౌలిపురా డివిజన్‌లలో మాత్రమే ఎన్నికల ప్రచారం నిర్వహించి.. మిగిలిన డివిజన్‌లలోని ఓటర్లకు అతని ముఖం ఎలా ఉంటుందో చూపించ లేదు.
- ఇక బీజేపీ అభ్యర్థి వీరేందర్ యాదవ్ సైతం గౌలిపురా, కుర్మగూడ డివిజన్‌లకే పరిమితమయ్యారు. అప్పుడప్పుడు ఐఎస్‌సదన్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి చేతులు దులుపుకున్నారు.
- యాకుత్‌పురా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రవిరాజ్ అసలు ఎన్నికల ప్రచారమే నిర్వహించ లేదు. కేవలం ఒకటి రెండు చోట్ల పాదయాత్రలు నిర్వహించిన ఆయన ఒక దశలో ఎన్నికల కార్యాలయానికి తాళాలు వేసి ఉన్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.
- ఇలా యాకుత్‌పురాలో మజ్లిసేతర పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థుల పోటీ నామమాత్రమే.

చార్మినార్‌లో మజ్లిస్‌కు గట్టి పోటీనిచ్చిన కాంగ్రెస్, బీజేపీ..

- చార్మినార్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్‌తో పాటు బీజేపీ అభ్యర్థి మెఘారాణి అగర్వాల్ పోటాపోటీగా ఎన్నికల బరిలో ఉన్నప్పటికీ..మజ్లిస్ పార్టీ అభ్యర్థి మీర్ జుల్ఫీకర్ అలీ విజయం సాధించనున్నారు.
- ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ నామమాత్రమే.

చాంద్రాయణగుట్టలో మజ్లిస్‌కు పోటీ నిచ్చిన బీజేపీ..

- చాంద్రాయణగుట్టలో ఈసారి కూడా మజ్లిస్ పార్టీ అభ్యర్థి అక్బరుద్దీన్ ఒవైసీ విజయం సాధించనున్నారు.
- బీజేపీ తరఫున భాగ్యనగర్ గణేషుత్సవ సమితి కార్యదర్శి కొడి మహేందర్ ఎన్నికల బరిలో ఉండి ప్రచారంలో దూసుకు పోయారు. అయినప్పటికీ ఇక్కడి నుంచి అక్బరుద్దీన్ ఒవైసీకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి.
- చాంద్రాయణగుట్టలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారం సక్రమంగా నిర్వహించకపోవడంతో వీరిరువురి ముఖాలు సైతం నియోజకవర్గం ఓటర్లకు తెలియకుండా పోయింది.

బహదూర్‌పురాలో కనిపించని బీఆర్‌ఎస్..

- బహదూర్‌పురా నియోజకవర్గం మజ్లిస్ పార్టీకి కంచుకోట. ఇక్కడి నుంచి మజ్లిస్ పార్టీ జెండాపై ఎవరూ పోటీ చేసినా గెలిచే అవకాశాలున్నాయి. ఇప్పటికే నియోజకవర్గం నుంచి హాట్రిక్ సాధించిన సిట్టింగ్ ఎమ్మెల్యే మొజంఖాన్‌కు ఈసారి టికెట్ లభించ లేదు. ఈయన స్థానంలో మోబిన్ ఎన్నికల బరిలో దిగగా.. భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారు.
- ఈ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి ఆయనకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేష్‌కుమార్ గట్టిగా పోటీనిచ్చారు.
- ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థి మీర్ ఇనాయత్ అలీ బాక్రీతో పాటు బీజేపీ అభ్యర్థి వై.నరేష్‌ల పోటీ నామమాత్రమే.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అబిడ్స్: కార్తీకమాసం వేడుకలు గుడిమల్కాపూర్‌లోని సాయిబాబా త్రయంబకేశ్వర ఆలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ముందుగా అమ్మవారికి పూజలు చేసి కార్తీకమాసం పూజలు చేపట్టారు. గుడిమల్కాపూర్‌తో పాటు పరిసర ప్రాంతాల మహిళా భక్తులు ఈ కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం కార్తీకమాస వనభోజనాలు చేపట్టారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. సాయంత్రం కార్తీకమాస దీపోత్సవాలు, శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కుంకుమార్చన చేస్తున్న మహిళలు

గోషామహల్‌లో తగ్గిన ఓటింగ్

తలలు పట్టుకుంటున్న అభ్యర్థులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో జరిగిన పోలింగ్‌లో ఓటింగ్ శాతం తగ్గడంతో పలు పార్టీల అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. 60 నుంచి 70 శాతం పోలింగ్ అవుతుందని ఊహించిన పార్టీల అభ్యర్థులకు కేవలం 55.38 శాతం పోలింగ్ కావడంతో టెన్షన్ పడుతున్నారు. తగ్గిన పోలింగ్‌తో విజయం ఎవరికి వస్తుందని ఇరు పార్టీల వారు కాకీ లెక్కలు వేస్తున్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడ్డాయి. కాంగ్రెస్ పార్టీ సైలెంట్‌గా ఓటింగ్ చేయించుకుంది. గత పదేళ్లుగా బీజేపీ అభ్యర్థి రాజాసింగ్, బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ల మధ్య పోటీ ఢీ అంటే ఢీ గా పోలింగ్ జరగడంతో ఇరువురు విజయాలు తమకేనని భావిస్తున్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మధ్య టఫ్ ఫైట్..

బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మధ్య టఫ్‌ఫైట్ ఉండడంతో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు విజయం కోసం లెక్కల మీద లెక్కలు వేస్తున్నారు. 235 పోలింగ్‌బూత్‌లలో ఎవరికి ఎక్కువ ఓట్లు పడ్డాయని ఆలోచనలు చేస్తున్నారు. అనుకున్న స్థాయిలో ఓటింగ్‌శాతం పెరగకపోవడం ఇరు పార్టీలను ఆలోచనలో పడవేసింది.


పోల్ అయిన ఓట్లు 1,49,857..

మొత్తం గోషామహల్ నియోజకవర్గంలో 2,70,683 ఓటర్లు ఉన్నారు. అందులో 1,49,857 ఓటు వేశారు. మొత్తం 55.38 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. పోలింగ్‌శాతం తక్కువ కావడంతో విజయం ఎవరిని వరిస్తుందోనని అందరు మదన పడుతున్నారు.

కార్వాన్‌లో తగ్గిన ఓటు శాతం ..

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం తగ్గడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. పోలింగ్ శాతం పెరిగిన తమ విజయ అవకాశాలు పెరుగుతాయని అభ్యర్థులు భావించారు. ప్రధాన పార్టీలైన మజ్లిస్, బీజేపీ, కాంగ్రెస్ వారు ఇంటింటికీ తిరిగి ఓట్లను అభ్యర్థించారు. తీరా ఎన్నికలు ముగిసిన తర్వాత పోలింగ్ శాతం తగ్గిందని అధికారులు ప్రకటించారు. కార్వాన్‌లో ఓటింగ్ శాతం 48.72 వచ్చింది. మజ్లిస్ పార్టీ ఓటు బ్యాంకు ఉన్న ప్రాంతాలతో పాటు బీజేపీ కార్వాన్‌లకు పట్టున్న ప్రాంతాల్లో సైతం ఓట్లు బాగా తగ్గాయి. గెలుపుపై ధీమాతో ఉన్న మజ్లిస్ పార్టీ వారు ఒకేసారి పోలింగ్ శాతం కిందకు రావడంతో విజయంపై లెక్కలు వేయడంలో అయోమయానికి గురవుతున్నారు. తామే గెలుస్తామన్న ధీమాతో ఉన్న మజ్లిస్ పార్టీ వారు ప్రస్తుతం మెజార్టీ తగ్గుతుందని అంటున్నారు. మరోవైపు బీజేపీ అగ్రనాయకుల ప్రచారంతో తమ విజయ అవకాశాలు మెరుగయ్యాయని బీజేపీ వారు నమ్ముతున్నారు. దీంతో ఆఖరి రోజున తమకు పడే ఓట్ల శాతం బాగా పెరుగుతుందని బీజేపీ నాయకులు భావించారు. తీరా తమకు పట్టు ఉన్న ప్రాంతాల్లో పోలింగ్ శాతం తగ్గడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని అంటున్న కాంగ్రెస్ వారు సైతం తగ్గిన పోలింగ్ శాతంతో దిగాలు పడుతున్నారు. పోలింగ్ శాతం పెరిగితే తమకు పడే ఓటింగ్ శాతం పెరిగేదని అందువల్లే తాము విజయంపై నమ్మకంతో ఉండేవారమని వారు అంటున్నారు.

3, 4 తేదీల్లో 371 ఉర్సు-ఇ-షరీఫ్


జియాగూడలో కమురేకి గుమ్మద్

జియాగూడ: ఈ నెల 3, 4వ తేదీల్లో జియాగూడలోని కమురేకి గుమ్మద్‌లో 371 ఉర్సు-ఇ-షరీఫ్ వేడుకలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ముతావలి సయ్యద్ నూర్ ఉల్ అంబియా హుస్సేని ఖుదా నుమాయీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సందల్ కార్యక్రమం, 4న చిరాగస్ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. చారిత్రాత్మకమైన సయ్యద్ షా మిరాజీ ఖద్మా సాజిదే సయ్యద్ నూరుల్లా ఉస్సేనీ దర్గాలో రెండురోజుల పాటు వేడుకలు జరుగుతాయన్నారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ దర్గాలో ప్రతి సంవత్సరం రెండురోజుల పాటు ఉర్సు వేడుకలు నిర్వహిస్తామన్నారు.

ముగిసిన పోలింగ్.. అభ్యర్థులు రిలాక్స్

చార్మినార్: పాతబస్తీలోని చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా నియోజకవర్గాలకు చెందిన వివిధ పార్టీల అభ్యర్థులు శుక్రవారం రిలాక్స్‌గా గడిపారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా రోజు తెల్లవారు జామునే నిద్ర లేచి బస్తీల్లోకి వెళ్లిన అభ్యర్థులు కాస్త ఆలస్యంగా నిద్ర లేచి ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించారు. కొంతమంది అభ్యర్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ మొబైల్ ఫోన్‌లను స్విచ్ఛాఫ్ చేసుకోగా.. మరికొంత మంది తమ కార్యకర్తలు, నాయకులతో సమావేశ మయ్యారు. పోలింగ్‌పై ఆరా తీశారు. ఏయే పార్టీకి ఎక్కడెక్కడ.. ఎన్నెన్ని ఓట్లు పడ్డాయనే విషయాలపై చర్చించారు. ఫలితాల కోసం ఈ నెల 3వ తేదీ వరకు ఎదురు చూడక తప్పదు. అయితే అప్పట్లోగా తమ పోలింగ్ ఏజెంట్ల ద్వారా తమకు ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయనే విషయాలను సేకరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గౌలిపురా: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఎస్.కృష్ణకాంత్ తెలిపిన వివరాల ప్రకారం..చార్మినార్ పంచ్‌మోహల్లా కమాన్ తపాడియా డయాగ్నోస్టిక్ సెంటర్ సమీపంలో గత నెల 27న ఉదయం 8 గంటల సమయంలో 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. దీంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అక్కడికి వెళ్లి గుర్తుతెలియని వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు స్థానికంగా భిక్షాటన చేస్తుండేవాడని పోలీసుల విచారణలో తెలిసింది.

న్యాయవాదులు సేవా దృక్పథంతో పని చేయాలి


మిర్జా ఎక్బాల్ అహ్మద్‌తో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: న్యాయవాదులు సేవా దృక్పథంతో పని చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయనను ప్రముఖ న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో ఎందరో పేదలు వివిధ రకాల కారణాల వల్ల కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాల కారణంగా ఎందరో కోర్టులకు వెళ్తున్నారని ఆయన అన్నారు. ఇటువంటి వారిలో చాలా మంది ఆర్థిక కారణాల వల్ల న్యాయవాదులను నియమించుకోవడంలో వెనుకాడుతున్నారని అన్నారు. కేసులను తీసుకునే ముందు న్యాయవాదులు తమ క్లైంట్ ఆర్థిక పరిస్థితిని కూడా పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. మజ్లిస్ సీనియర్ నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

యువతికి అరుదైన శస్త్రచికిత్స

గొంతులోని చీముగడ్డను తొలగించిన ఈఎన్‌టీ వైద్యులు


శస్త్రచికిత్స చేసిన ఈఎన్‌టీ వైద్య బృందం

సుల్తాన్‌బజార్: గొంతులో చీముగడ్డ తొలగించి ఓ యువతి ప్రాణాలను కోఠి ఈఎన్టీ ఆస్పత్రి వైద్యులు కాపాడారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన శృతి (15) కొంతకాలంగా గొంతులో ఏమీ మింగకుండా బాధపడుతుండేది. గత నెల 28న రాత్రి 11 గంటలకు కోఠి ఈఎన్టీ ఆస్పత్రికి రావడంతో ఈఎన్టీ వైద్యులు ఆమెను అడ్మిట్ చేసుకుని 29న సిటీ స్కాన్‌తో పాటు అన్ని రకాల రక్తపరీక్షలు నిర్వహించారు. గొంతులో ఒక పెద్ద చీముగడ్డ ఉన్నట్లుగా తేలడంతో గొంతు వెనుకభాగం నుంచి ఛాతి పైభాగానికి కూడా విస్తరించినట్లు గుర్తించారు. ఆలస్యం చేస్తే ఈ చీముగడ్డ మరింత పెరిగి శ్వాసనాళానికి కూడా అడ్డుపడి రోగి ప్రాణాలకు ప్రమాదంగా మారే అవకాశం ఉందని వైద్యులు వెంటనే శస్త్రచికిత్స చేశారు. ఈ చీముగడ్డ నుంచి దాదాపుగా 300 ఎంఎల్ చీమును తీశామని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. చీముగడ్డను తొలగించి రోగి ప్రాణాలను కాపాడిన వైద్య బృందమైన డాక్టర్ ఆనందచార్య, డాక్టర్ సంపత్‌రావు, డాక్టర్ తణి, డాక్టర్ స్వామి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ నిఖిల, సీనియర్ అసిస్టెంట్లను, పోస్టు గ్రాడ్యుయేట్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ అభినందించారు.

పోలీస్ కృష్ణయ్య ముదిరాజ్‌కు ఘన నివాళి


కృష్ణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: మలిదశ తెలంగాణ ఉద్యమంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొలి అమరుడు పోలీస్ కృష్ణయ్యకు దక్కాల్సిన గౌరవాన్ని ఇవ్వలేదని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్ అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు పోలీస్ కృష్ణయ్య ముదిరాజ్ 14వ వర్ధంతిని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ..అమరుడు పోలీస్ కృష్ణయ్యకు ప్రభుత్వం తొలి అమరుడుగా ఆయన పేరు ప్రకటించలేదన్నారు. కృష్ణయ్య పేరుపై జిల్లా, కళాశాల ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో 52 లక్షల మంది ఉన్న ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని బీఆర్‌ఎస్ పార్టీ కించపరిచిందన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమాన్ని విస్మరించిన పార్టీలకు ఈ ఎన్నికల ఫలితాలు గుణపాఠంగా నిలుస్తాయన్నారు. రేపు ఏర్పాటు చేయబోయే ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మహాసభ ఉపాధ్యక్షులు జగన్ ముదిరాజ్, నగేష్, నర్సింగ్, సాయి, సంపత్, గీత, వెంకట్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన


కొవ్వొత్తులతో అధికారులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కోఠిలోని రాష్ట్ర కార్యాలయంలో ప్రపంచ ఎయిడ్స్ డే ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి ఐఏఎస్, టీఎస్ ఎంఎస్ఐడీసీ ఎస్.మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ మురళీధర్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ సంచాలకులు హైమావతి మాట్లాడుతూ..1988 నుంచి ప్రతి డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించడానికి, హెచ్‌ఐవీ నివారణ, చికిత్స, సంరక్షణ సేవలను బలోపేతం చేయడానికి ఎయిడ్స్ బారిన పడి మరణించినవారి జ్ఞాపకార్థం ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిచే హెచ్‌ఐవీ నివారణ, నియంత్రణకు పాటుపడి హెచ్‌ఐవీ రహిత తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారులు, సిబ్బంది, భాగస్వాములు, ప్రభుత్వయేతర సంస్థలు, కమ్యూనిటీ ఆధారిత సంస్థలు పాల్గొన్నాయి.

అక్రమ పార్కింగ్‌లతో పరేషాన్

- రెస్టారెంట్లు, మాల్స్ ముందు రోడ్లపైనే వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, పాదచారులు
- ఫొటోలు తీసి చేతులు దులుపుకుంటున్న ట్రాఫిక్ పోలీసులు


పాత ముంబై జాతీయ రహదారిపైనే వాహనాలు

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లకు అడ్డూ అదుపు లేకుండాపోతుంది. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపైనే దర్జాగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెస్టారెంట్స్, మాల్స్ ముందు కాకుండా ప్రభుత్వ కార్యాలయాల ముందు అక్రమ పార్కింగ్‌లు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మెహిదీపట్నం, నానల్‌నగర్, టోలిచౌకీ, షేక్‌పేట్ నాలా తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై గంటల తరబడి రోడ్లపై వాహనాలు పార్కు చేసి ఉంటున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు..

టోలిచౌకీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో వాహనాల అక్రమ పార్కింగ్ యథేచ్ఛగా జరుగుతోంది. ప్రస్తుతం ఈ పోలీస్‌స్టేషన్ గోల్కొండ పాత పోలీస్ క్వార్టర్స్ భవనంలోకి మార్చబడింది. ఈ మార్పుతో అక్రమ పార్కింగ్‌ల జోరు మరింత పెరిగింది. ఇరానీ హోటళ్లు, మాల్స్ ఎదురుగా రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయడంతో ఆ ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. దీంతో ట్రాఫిక్ పోలీసుల పనితీరుపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ పార్కింగ్‌లకు కారణమవుతున్న హోటళ్లు, రెస్టారెంట్లు, మాల్స్ వారి జోలికి ట్రాఫిక్ పోలీసులు వెళ్లడం లేదు. వ్యాపారులతో మాట్లాడి వారి షాపులు, రెస్టారెంట్ల ముందు అక్రమ పార్కింగ్‌లు జరగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే కొంత మేర ట్రాఫిక్ సమస్యలను నివారించవచ్చు.

అక్రమ పార్కింగ్‌ల అడ్డాలు ఇవే..

మెహిదీపట్నం చౌరస్తా ప్రిన్స్ హోటల్, గుడిమల్కాపూర్ చౌరస్తా, షేక్‌పేట్ డీమార్ట్, టోలిచౌకీ షాగౌస్ కేఫ్, పశ్చిమ మండలం ఆర్డీవో కార్యాలయం, టోలిచౌకీ రాఘవేంద్ర కేఫ్, టోలిచౌకీ రుమాన్ హోటల్, రహమత్‌హోటల్, మాల్స్ ముందు ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్లపైనే వాహనాలు పార్కు చేసి ఉంటున్నాయి.